క్లుప్తంగా

17న లక్ష్మీ నర్సింహస్వామి వార్షిక కల్యాణం

భీమునిపట్నం: భీమిలి సొమ్మగిరిపై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక కల్యాణం ఈ నెల 17న జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు ఆర్.సింగరాచార్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పూర్తి వివరాలకు 88974 36252 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


మద్దిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది పిలకయ్య గారి కళ్లాల్లో రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పిలకయ్య గారి కళ్లాల్లోని నివాస ప్రాంతాలకు విద్యుత్ సమస్య తీరిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు, బుగత ఎర్నాయుడు, కనకల అప్పలరాజు, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


టీబీపై అవగాహన కల్పిస్తున్న భీమునిపట్నం టీబీ విభాగం సూపర్ వైజర్ ప్రేమ్

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం క్షయ వ్యాధిపై టీబీ విభాగం సూపర్‌వైజర్ ప్రేమ్ అవగాహన కల్పించారు. 60 ఏళ్ల దాటిన వారు, టీబీ మందులు వాడిన వారు, బాధిత కుటుంబ సభ్యులు, పొగాకు తాగే అలవాటు ఉన్న వారు, మధుమేహంతో బాధపడుతున్న వారు బీసీజీ వ్యాక్సిన్ విధిగా వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ టీకా కేంద్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో శ్యామ్, భీమునిపట్నం, రేవిడి టీబీ యూనిట్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీ కాలనీలో శుక్రవారం అభయాంజనేయ స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వేకువజామున మేలుకొలుపు, ఊరేగింపు, స్వామికి పంచామృతాలతో అభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. మహా మృత్యుంజయ హోమం చేపట్టారు. మధ్యాహ్నం దాతలు బోని వెంకటరమణ, మామిడి కన్నారావు, టొంపల రవి సాయంతో కాలనీలో మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ప్రసాద వితరణ, భజన కార్యక్రమాలు జరిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మొగదారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ సమీపంలోని శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ హోమం నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

వ్యర్థాల తొలగింపునకు తక్షణ చర్యలు

- గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డుపై చెత్త తొలగింపు
- ఇతర ప్రాంతాలను పరిశీలించిన వైద్యాధికారి కిశోర్


గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డులో వేసిన చెత్తను మిషన్‌తో తొలగింపు చర్యలు


ఓజోన్ వ్యాలీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో వేసిన గృహ నిర్మాణ వ్యర్థాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి కిషోర్


రోడ్లను శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: శివారు ప్రాంతాల్లో మాస్టర్‌ప్లాన్ రోడ్లపై వేసిన చెత్త, గృహ నిర్మాణ వ్యర్థాల తొలగింపునకు అధికారులు సత్వర చర్యలు తీసుకున్నారు. రహదారులపై వ్యర్థాలు పేరుకుపోవడంతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'డంపింగ్ యార్డులుగా శివారు రోడ్లు' కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించి, తక్షణ చర్యలు తీసుకున్నారు. వివరాలివి.. జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల పరిధిలో ప్రభుత్వం కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన శివారు ప్రాంత మాస్టర్ ప్లాన్ రోడ్లు డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. మారికవలస ఆర్‌జీకే కాలనీ దరి కాపులుప్పాడలోని జీవీఎంసీ యార్డుకు ఈ వ్యర్థాలు తరలిస్తే డీజిల్ ఖర్చు పెరిగిపోతుందని కొందరు లారీ యజమానులు వారికి అందుబాటులో ఉండే, కాస్త జన సంచారం తక్కువ ఉన్న రోడ్లపైనే గృహ నిర్మాణ వ్యర్థాలు, ప్లంబింగ్ వ్యర్థాలతో పాటు కొబ్బరి, తాటి వ్యర్థాల వంటివి వేసేస్తున్నారు. ఇలా వ్యర్థాలు వేయకుండా చూడడం, వేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఆయా సచివాలయాల పరిధిలో శానిటేషన్, ప్లానింగ్ సెక్రటరీలతో పాటు జోన్‌లో టౌన్ ప్లానింగ్, శానిటరీ అధికారులు ఎంతమంది ఉన్నా వీరిని నియంత్రించలేకపోతున్నారు. పైగా కొంత మంది అధికారులు, సిబ్బంది వీరితో కుమ్మక్కై పోతున్నారన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొమ్మాది ఓజోన్ వ్యాలీ, మారికవలస–తిమ్మాపురం, ఎండాడ లా కాలేజీ, మిథిలాపురి వుడా కాలనీ- ఐటీ సెజ్ తదితర మాస్టర్ ప్లాన్ రహదారుల్లో నిబంధనలకు విరుద్ధంగా డంప్ చేసిన వ్యర్థాలను జీవీఎంసీ జోన్–2 వైద్యాధికారి కిశోర్ పరిశీలించారు. జీవీఎంసీ 6వ వార్డు గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డులో పేరుకు పోయిన చెత్త తొలగింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. రహదారిపై చెత్త, గృహ నిర్మాణ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

28న 100వ తపాలా డాక్ అదాలత్

ఎంవీపీ కాలనీ: తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 28న ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ రీజనల్ కార్యాలయంలో 100వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఆర్ఎంఎస్–వీ డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్నరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 100వ డాక్/ పెన్షన్స్ అదాలత్‌గా దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అల్లూరి, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు తమ సమస్యలను ఈ నెల 21వ తేదీ లోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం 28వ తేదీ జరిగే డాక్ అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఇంధన వనరులను ఆదా చేద్దాం


ఇంధన వనరుల పొదుపు గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: తరిగిపోని శక్తి వనరు అయిన సూర్యరశ్మిని వినియోగించుకుని పర్యావరణానికి హాని కలిగించే ఇంధన వనరులను క్రమేణా తగ్గించుకోవాలని చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి విద్యార్థులకు సూచించారు. బొగ్గు, గ్యాస్, ఖనిజ ఇంధనాలు తదితర పరిమిత వనరుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. హైస్కూల్ ఆవరణలో ×మిషన్ లైఫ్ కోసం ఎకో క్లబ్× అనే థీమ్ కార్యక్రమాల్లో భాగంగా శక్తిని ఆదా చేయడానికి గల కారణాలు, ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, సేనో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రచారంలో ప్రతీ విద్యార్థి భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటేలా ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు కె.రామలక్ష్మి, ఎస్.ఉదయ కుమార్, సీహెచ్.డి.వి.రాణి, భాగ్యవతి, మాధవి, భీమాబాయి, పీవీ లక్ష్మి, సత్యవతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లు దాటిన పిల్లలను బడిలో చేర్పించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తగరపువలస: ఐదేళ్లు దాటిన చిన్నారులను తల్లిదండ్రులు విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ పీవో పి.శ్రీదేవి సూచించారు. ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీదేవి మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలు బడి బయట ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.వి.వి.రత్నం, అంగన్‌వాడీ నిర్వాహకురాలు పి.కృష్ణకుమారి, చిన్నారులు, వారి మాతృమూర్తులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి శాస్త్ర విద్య దోహదం

- ఆర్జేడీ విజయభాస్కర్


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

సింహాచలం: శాస్త్ర విద్య అనేది సమాజ అభివృద్ధికి ఆధారమైనది.. జీవశాస్త్రాన్ని బోధించే ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అప్‌గ్రేడ్ చేసుకుంటూ నాణ్యమైన బోధనను అందించాలని ఆర్జేడీ విజయభాస్కర్ సూచించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో విశాఖ జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నైపుణ్యాల పెంపుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ శాస్త్ర విద్య ఎంత నేర్చుకున్నా తరగనిదన్నారు. కొత్తగా ఆలోచించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్ర నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం ఓరియంటేషన్ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, రిసోర్సు పర్సన్స్ ఎస్.బాబూరావు, జి.చంద్రమౌళి, సీహెచ్.రాధాకృష్ణ, పి.రవిప్రసాద్, ఎంవి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

51 మంది రక్తదానం


రక్తదానం చేస్తున్న దాతలు

తగరపువలస: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో 51 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనిల్ నీరుకొండ విద్యా సంస్థల సీఈవో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమాదేవి, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, రక్తనిధి కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ మల్లాది శర్మ తదితరులు మాట్లాడారు. రక్తదానంతో ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మధురవాడ: జ్యేష్ఠ మాసం శుక్ల పక్షం అష్టమి, శుక్రవారాన్ని పురస్కరించుకుని చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల హరి ప్రసాద్‌శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో నీరాజన మంత్రపుష్పం సమర్పించారు. పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, విశేషంగా అలంకరించారు. మధురవాడ సాయిప్రియ గార్డెన్‌కు చెందిన వరప్రసాద్ రెడ్డి, భూదేవి దంపతుల సహాయ సహకారాలతో భక్తులకు పులిహోర ప్రసాదం పంచారు. కార్యక్రమంలో ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు పీవీజీ అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం


ప్రహరీ తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రెవెన్యూ కె.నగరపాలెం పరిధి ఎస్సీ కాలనీ సర్వే నంబర్ 314లో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి అనధికారిక నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ప్రహరీ కట్టిన విషయాన్ని స్థానికులు ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం వీఆర్‌వో అప్పలరాజు, వీఆర్‌ఏలు సురేష్, దుర్గ ఇక్కడ అనధికారిక నిర్మాణాన్ని తొలగించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీవో హెచ్చరించారు.

దేవస్థానం పాఠశాలలో సకల సౌకర్యాలు

- ఈవో శ్రీనివాసమూర్తి
- విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల ఆవరణలోనే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఈ రాంబాబును ఆదేశించారు. పాఠశాలను శుక్రవారం ఈవో సందర్శించారు. 1994–95,2002–03 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతో పాటు మాస్టర్ ఈకే స్పిరిచ్యువల్ సేవా సంస్థలు, గొడవర్తి వంశీ అండ్ ఫ్రెండ్స్ వితరణగా అందించిన నోట్ పుస్తకాలను ఈవో విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలకు ఎంతో ఘనకీర్తి ఉందన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని వివరించారు. ముఖ్యంగా హాస్టల్ ఒకచోట, పాఠశాల మరో చోట ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు గ్రహించామన్నారు. తర్వలోనే పాఠశాల క్యాంపస్‌లోనే హాస్టల్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్, ప్రధానోపాధ్యాయురాలు భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేరాఫ్ ఫుడ్‌పాత్


రకరకాల వంటకాలతో బారులుతీరిన మొబైల్ వాహనాలు


జూ రోడ్డులో టూ వీలర్ ద్వారా తాటిబెల్లం, తాటితాండ్ర, మామిడితాండ్ర, పూతరేకుల విక్రయం


ఫాస్ట్‌ఫుడ్ మొబైల్ వాహనం

- వినియోగదారులు కోరుకునే చోటే ఆహారం.. పానీయాలు
- పనికి ఆటంకం లేదని.. సమయం కలిసొస్తుందంటున్న కస్టమర్లు
- ఫుడ్ ఆన్ వీల్స్‌కు చిరునామా సౌత్ జైల్‌రోడ్డు


మామూళ్ల బెడద లేదు. కరెంటు.. షాపు అద్దె లేదు. ఒకే వ్యాపారం చేయాలన్న ఒత్తిడి లేదు. నచ్చిన చోట మెచ్చిన వ్యాపారం చేసుకోవచ్చు. టిఫిన్ సెంటర్ నుంచి షర్బత్ బండి వరకూ ఏదైనా చేసుకునే వెసులుబాటు.. వినియోగదారులు మెచ్చే ఆహారం.. మొబైల్ బిజినెస్ ఇప్పుడు ఎవర్‌గ్రీన్ ట్రెండ్.

దాబాగార్డెన్స్ : పట్టణీకరణ పెరగడంతో మనుషుల అవసరాలు, ఆలోచనల్లో కూడా చాలా మార్పులు వచ్చాయి. బిజీ బిజీ జీవనంలో ప్రతీది శుచి, శుభ్రతతో ఉన్న వస్తువులు తమ వాకిట్లోకి, లేదా తాము విధులు నిర్వహించే చోట, ఆఫీసుకు వెళ్లే మార్గంలో ఉంటే బాగుంటుంది అనుకుంటున్నారు. జీవనం యాంత్రికం అయిపోవడంతో హోటళ్లు, షాపులకు వెళ్లే సమయం చాలా మందికి దొరకడం లేదు. దీంతో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా వ్యాపారులు సైతం సిద్ధం అవుతున్నారు. ఇప్పుడు మొబైల్ హోటళ్లు, షర్బత్‌లు వినియోగదారులకు ఇట్టే అందుబాటులోకి వస్తున్నాయి. చివరకు కొబ్బరి బొండాలు.. పలు రకాల పండ్లు వంటివి కూడా ఆటోల్లో అమ్మేస్తున్నారు. దీని వల్ల వినియోగదారుల చెంతకే ఆహార పదార్థాలు చౌక ధరలకు అందడం ఒక విషయమైతే.. వ్యాపారులు కూడా ఒకే చోట ఉండి అక్కడి పరిస్థితుల మీదనే ఆధారపడకుండా ఎక్కడ, ఏ సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందో అక్కడికి వెళ్లిపోతున్నారు. పైగా ఈ వాహనాల్లోని ఆహార పదార్థాలు శుచి, శుభ్రత, నాణ్యంగా ఉండటంతో వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం నగరంలో గజం స్థలం ధర చుక్కలంటడం, పైగా రోడ్డు పక్కన తోపుడు బండి పెట్టుకుందామన్నా రకరకాల ఒత్తిళ్లు, మామూళ్ల బెడద పెరిగిపోవడం, కరెంటు, షాపు అద్దెలాంటి ఇబ్బందుల వల్ల ఈ మొబైల్ వ్యాపారమే బేషుగ్గా ఉందని వ్యాపారులు అంటున్నారు. వినియోగదారులు హోటళ్లకు వెళ్లి వేచి ఉండాల్సిన పని లేకుండా పనులకు వెళ్లే దారిలోనే టిఫిన్, కొబ్బరి బొండాలు, షర్బత్ వంటివి దొరుకుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారాలు జీవీఎంసీ పరిధి దక్షిణ నియోజకవర్గంలో కోకొల్లలు. సౌత్ జైల్‌రోడ్డులో ఫుడ్ ఆన్ వీల్స్ ఘుమఘుమలు పంచుతున్నాయి.

ఫుడ్ ఆన్ వీల్స్‌కు కేరాఫ్ సౌత్ జైల్‌రోడ్డు..

సాయంత్రమైతే చాలు.. సౌత్ జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో వందలాది బళ్లలో కోరుకునే ఆహారం దొరుకుతోంది. చేతిలో కార్డు ఉండే చాలు.. ఏం కావాలో అవి తినవచ్చు. ఏటీఎం డెబిట్/క్రెడిట్ కార్డ్స్‌తో పాటు పేటీఎం.. గూగుల్ పే.. ఇలా ఎన్నో రకాల వెసులుబాటుతో కోరింది తిని బిల్ చెల్లించుకోవచ్చు. సాయంత్రం 4 నుంచి అర్ధరాత్రి వరకు ఇక్కడ టిఫి.. నూడిల్స్.. చికెన్ జాయింట్స్.. ఫ్రైడ్ రైస్.. ఇలా అన్ని రకాల వంటకాలతో పాటు చల్లని పానీయాలు కూడా మొబైల్ వ్యాన్లలో లభిస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార : ప్రాణ త్యాగం చేసైనా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని సీఐటీయూ జిల్లా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై.రాజు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహారదీక్ష 1141వ రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, మేధావులు అందరూ ఒక్క తాటిపైకి వచ్చి పోరాటం సాగిస్తున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తోందన్నారు. అటువంటి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉన్న ఉద్యోగాలు పోవడంతో పాటు తర్వాతి తరాలకు ఉపాధి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కేంద్రంతో మాట్లాడి ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కె.నర్సింగరావు, ఎర్రిబాబు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.